తేదీ 26.02.2006, శివరాత్రి, సాయికుల్వంత్ హాలు

# సర్వం బ్రహ్మమయం

**బ్రహ్మాండమంతయు నిండియున్నవానికి**
**ఆలయంబు నమర్చ అలవి యగునె**
**సర్వ జీవులయందు సంచరించెడి తనకు**
**సరియైన పేరిడ సాధ్యమగున**
**సర్వ జలములయందు సంచరించెడి తనకు**
**స్నానంబు జేయింప సాధ్యమగున**
**బ్రహ్మాండమంతయు బొజ్జలో నుండగ**
**భక్ష్య భోజ్యము తనకు పెట్ట తగున**
**అజహరాదులకైనను అందనట్టి**
**ఇట్టి తన రూపు కనుగొన నెవరి తరము!**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

**ఈ** దృశ్యకల్పిత జగత్తును మనము 'ప్రపంచము' అని పిలుస్తున్నాము. పంచభూతములయొక్క సమ్మిళిత స్వరూపమే 'ప్ర-పంచము'. 'ప్ర' అనగా వికసించడం, ప్రకటించడం. పంచభూతములను ప్రకటించునదే ప్రపంచము. కేవలం పంచభూతములనే కాదు, పంచప్రాణములనుకూడను ప్రకటించునది ప్రపంచము. పంచభూతములనగా అగ్ని, జలము, పృథ్వి, వాయువు, ఆకాశము. పంచప్రాణములనగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు. పంచ భూతములు, పంచప్రాణములే ఈ జగత్తునకు ఆధారమై ఉన్నవి. మానవత్వమును, యావత్ ప్రపంచమును కాపాడుతూ వస్తున్నవి పంచభూతములే.



sri sathyasaivachanamrutam

ఇందులో ఏ ఒక్కటి లేకపోయినను సర్వం శూన్యమే. చెవులతో శబ్దమును వింటున్నాం; కన్నులతో దృశ్యమును చూస్తున్నాం. ఈరీతిగా, మన పంచేంద్రియములు ప్రపంచముయొక్క ఉనికిని నిరూపిస్తున్నవి. అయితే, ఈ జగత్తులో ఏదీ శాశ్వతము కాదు. అన్నింటియందును అంతర్భూతమై ఉన్న బ్రహ్మతత్త్వము ఒక్కటే శాశ్వతమైనది. అదియే సర్వమునకు ఆధారము.

### బ్రహ్మాండమే భగవత్స్వరూపము

'బ్రహ్మ' అనగా పంచభూతములు, పంచప్రాణములు, పంచకోశములతో కూడిన సర్వవ్యాపక తత్త్వము. ఇట్టి దివ్యతత్త్వమునకు మానవుడు ఒక ఆకారమును కల్పించి పూజచేస్తున్నాడు. రూపనామములు శాశ్వతమైనవి కావు. కాబట్టి, బ్రహ్మతత్త్వానికి ఒక రూపమును కల్పించి పూజచేయడం చాలా పొరపాటు. బ్రహ్మను బ్రహ్మాండస్వరూపునిగా భావించి పూజించాలి. బ్రహ్మాండమే భగవత్ స్వరూపము. ఈ బ్రహ్మాండమునకు ప్రేమయే ఆధారము. ప్రేమయే లేకుండిన ప్రకృతియే లేదు, ఈ ప్రపంచమే లేదు. పంచభూతములయందు అంతర్భూతమై, సమత్వంగా ఉన్న ప్రేమతత్త్వమే ఈ ప్రపంచమునకు ఆధారము. ఇట్టి ఘనమైన ప్రేమతత్త్వమును విస్మరించి మానవుడు అల్పమైన కోరికలను పెంచుకొని ఆనందముకొరకు ఆరాటపడుతున్నాడు. ప్రేమతత్త్వమును విస్మరించి ఎన్ని పూజలు చేసినప్పటికీ ఉపయోగముండదు.

### ప్రతి వ్యక్తిలోను భగవంతుణ్ణి దర్శించాలి

'జంతూనాం నరజన్మ దుర్లభం'. మానవజన్మ కడు దుర్లభమైనది. నిజానికి మానవత్వమే దైవత్వము. కాని, నేటి మానవుడు ధర్మార్థ కామమోక్షములనే చతుర్విధ పురుషార్థములలో ధర్మమును, మోక్షమును విస్మరించి అర్థ, కామములను పట్టుకొని వ్రేలాడుతున్నాడు. అందరిలోను భగవంతుడున్నాడు. భార్య, పిల్లలు, బంధువులు, మిత్రులు, శత్రువులు వీరందరినీ భగవంతుడే సృష్టించాడు. భార్యను భార్యగా చూస్తే సరిపోదు; ఆమెలోకూడా దైవాన్ని చూడాలి. పిల్లలుకూడా బ్రహ్మస్వరూపులే. శత్రువులుకూడా బ్రహ్మ స్వరూపులే. ప్రతి వ్యక్తిలోను భగవంతుణ్ణి దర్శించాలి. అదే మానవుని ప్రధాన కర్తవ్యం. గడచిన యుగాలలో

sri sathyasaivachanamrutam

అనేకమంది భగవంతునికే శత్రువులుగా తయారై ఆయనతో పోరాడినారు. తనతో పోరాడినవారినికూడా భగవంతుడు ఎంతో దయతో తనలో చేర్చుకున్నాడు.

ఈ ప్రపంచములో భగవంతుడు లేని స్థానము ఎక్కడకూడను లేదు. దేనియందు చూచినా భగవంతు డున్నాడు.

**సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షిః శిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

ఎవరు చూడకపోయినను తాను చూస్తూనే ఉన్నాడు. ఎవరు వినకపోయినను తాను వింటూనే ఉన్నాడు. కాని, ఈ సత్యాన్ని మీరు గుర్తించుకోలేకపోతున్నారు. "భగవంతుడనేవాడు ఒకడుంటే మనకు కనిపించడంలేదే! మన ప్రార్థనలు వినడానికి ఆయన చెవులు ఎక్కడున్నాయి?" అని అనేకమంది వాదిస్తుంటారు. శబ్దమే దైవస్వరూపము. శబ్దము లేనటువంటి స్థానము ఎక్కడా కనిపించదు. ఆ శబ్దమే భగవంతుని వినికిడి. కాంతి లేనటువంటి ప్రదేశము ప్రపంచములో ఎక్కడకూడను కనిపించదు. ఆ కాంతియే భగవంతుని దృష్టి. కనుక, భగవంతునికి ఏమీ తెలియదని భావించకండి. కంటికి కనిపించనంతమాత్రమున భగవంతుడు లేడని వాదించకండి. మీ హృదయమునుండి ఆవిర్భవించే భావములు ఎక్కడి నుండి వస్తున్నాయి? అది కేవలం భగవంతునియొక్క సంకల్పమే. ప్రాపంచిక దృష్టిలో ఒకటి హెచ్చవచ్చు, మరొకటి తగ్గవచ్చు. కాని, పరమాత్ముని తత్త్వము ఏమాత్రము హెచ్చదు, తగ్గదు. లోకము, లోకేశుడు ఇరువురూ ఒకటే. సృష్టికి, సృష్టికర్తకు మధ్య అవినాభావ సంబంధమున్నది.

### దివ్యత్వానికి రూపనామములు కల్పించడం అజ్ఞానం

సర్వత్రా వ్యాపించియున్న దివ్యత్వమునకు 'ఆత్మ' అని పేరు పెట్టారు. ఆత్మకు ఒక ప్రత్యేక రూపము లేదు. ఇట్టి దివ్యత్వాన్ని ఏకత్వంగా భావించుకొనక, దానికి రూపనామములు కల్పించి, పూజచేయడం చాలా పొరపాటు. భగవంతునియొక్క పూర్ణత్వాన్ని గుర్తించుకోలేకపోవడంచేతనే ఈవిధమైన పాట్లుపడుతున్నాడు, మానవుడు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. సర్వమూ భగవంతుని స్వరూపమే. అట్టి పరిపూర్ణమైన

srisathyasaivachanamrutam

భగవత్స్వరూపాన్ని గుర్తించుకొనలేక, భగవంతునికి అల్పమైన ఆకారములు కల్పించి, రాముడు, కృష్ణుడు, విష్ణువు మొదలైన పేర్లు పెట్టి పూజిస్తున్నారు. కుమ్మరి బంకమట్టితో రాముని బొమ్మ చేస్తాడు, కృష్ణుని బొమ్మ చేస్తాడు, విష్ణువు బొమ్మ చేస్తాడు. ఒకే మట్టియే ఇన్ని రూపనామములను ధరిస్తున్నది.

**శృంగారములు వేరు, బంగారమొక్కటె**
**పశుల వన్నెలు వేరు, పాలు ఒకటె**
**జీవజంతులు వేరు, జీవుండు ఒక్కడె**
**కులములన్నియు వేరు, పుటుక ఒకటె**
**దర్శనంబులు వేరు, దైవమ్ము ఒక్కటె**
**పూల వన్నెలు వేరు, పూజ ఒకటె**

కాని, ఇట్టి ఏకత్వమును మీరు గుర్తించుకొనలేక అనేకత్వములో పడి అజ్ఞానములో మునిగిపోతున్నారు.

**భగవంతుడు మీ భావానికి తగిన ఫలితాన్నిస్తాడు**

భగవంతుని స్వరూపమును 'ఇట్టిది, అట్టిది' అని ఎవ్వరూ వర్ణించలేరు, నిరూపించలేరు. నామము లేకుండా రూపము లేదు. రూపము లేకుండా నామము లేదు. నామరూపములకు అతీతమైనది భగవత్తత్త్వము. ఈ ప్రపంచములోని ప్రతి వస్తువు, ప్రతి జీవియు ప్రేమస్వరూపములే. ఈ ప్రపంచమును కేవలం ప్రపంచముగా మనము భావించకూడదు; దీనిని భగవత్స్వరూపంగా, ప్రేమస్వరూపంగా భావించాలి. ఇట్టి సర్వవ్యాపకమైన భగవత్తత్త్వానికి మీరు మీ పరిమిత జ్ఞానముచేత అల్పమైన రూపనామములను ఆపాదిస్తున్నారు. "యద్భావం తద్భవతి". భగవంతుడు మీ భావానికి తగినటువంటి ఫలితాన్ని అందిస్తాడు. పరిపూర్ణతత్త్వముతో మీరు భగవంతుణ్ణి ప్రేమిస్తే, భగవంతుడుకూడా మీకు పరిపూర్ణమైన ఆనందమును అందిస్తాడు. భగవంతుడు జనన మరణములకు, సుఖదుఃఖములకు, పాపపుణ్యములకు అతీతుడు. భగవంతునికికూడా బాధ, దుఃఖము అనేవి ఉన్నాయని మీరు భావించవచ్చును. కాని, భగవంతుని దృష్టిలో దుఃఖమే లేదు. తాను దేనినీ వాంఛింపడు, దేనినీ విసర్జించడు. దుఃఖము మీయొక్క కల్పన.

sri sathyasaivachanamrutam

ఆనందము కూడా మీ కల్పనయే.

**భగవంతుడు ఏది చేసినా మీ మంచికోసమే!**

భగవంతుడనగా ప్రత్యేకంగా ఎక్కడో ఉన్నటువంటివాడు కాదు. కాని, మీరు భగవత్తత్వాన్ని సరిగా గుర్తించుకొనలేక భగవంతునిగూర్చి అనేకవిధములుగా ఊహిస్తున్నారు; ద్వైతభావమువలన ఏర్పడినటువంటి బలహీనతతో కాలము గడుపుతున్నారు. మొట్టమొదట మీరు భగవంతుడు ఒక్కడే అని గుర్తించాలి. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. అయితే, డ్రామాలో వేషాలను ధరించినట్లుగా భువిపైకి అవతారములు వస్తుంటాయి. నిండుసభలో దుర్యోధన, దుశ్శాసనాదులు ద్రౌపదిని అవమానిస్తున్నప్పుడు భీముడు పట్టరాని ఆవేశంతో వాళ్ళను చంపడానికి సిద్ధపడ్డాడు. కాని, అటువంటి పరిస్థితిలోకూడా భగవంతుడు వాళ్ళను చంపాలని సంకల్పించుకోలేదు. మనం ఎటువంటి కష్టమును అనుభవించవలసి వచ్చినప్పటికీ అది భగవత్సంకల్పమే అని భావించి భరించడం అత్యవసరం. ఏది జరిగినా మన మంచికే! 'ఇది చెడ్డ, అది మంచి' అనే భేదములకు చోటివ్వ కూడదు. అయితే, ఆవిధంగా భరించుకోవడం కొంత కష్టమే. ఈ కష్టములను భరించుకునే శక్తి నిమిత్తమై మనం పూజలు, వ్రతములు ఇత్యాది సత్కర్మలను ఆచరిస్తున్నాము. ఈనాడు దుఃఖముగా ఉండవచ్చు; రేపటికి పరిస్థితి మారిపోవచ్చు. కష్టము, దుఃఖము ఎప్పటికీ ఉండేవి కావు. Pleasure is an interval between two pains. రెండు బాధల మధ్యలోనే ఆనందము లభిస్తుంది. Happiness is union with God. భగవంతునితో కూడియుండడమే ఆనందము. భగవంతునికి దుఃఖము, విచారము, కష్టము అనేవి లేవు. నీవు ఏమి చేసిననూ 'తథాస్తు! తథాస్తు!' అంటాడు. అంతా నీమంచికోసమే జరగాలని ఆశీర్వదిస్తుంటాడు. భగవత్తత్వాన్ని మనము చక్కగా గుర్తిస్తే మనకు దుఃఖమే ఉండదు. 'ఏదో ఒక మంచిని మనకు అందించే నిమిత్తమై భగవంతుడు మనచేత ఈ కష్టములను అనుభవింపజేస్తున్నాడు' అనుకోవాలి. కష్టము లేకుండా సుఖము, సుఖము లేకుండా కష్టము ఉండడానికి వీల్లేదు. మానవజన్మ ఎత్తినందుకు మీరు దుఃఖమును, కష్టమును భరించే శక్తిని సాధించాలి. 'ఇవన్నీ నా మంచికోసమే' అని

sri sathyasai vahanamrutam

అనుకోవాలి.

**మా - న - వ**

భగవంతునికి అనేకత్వాన్ని ఆపాదించకూడదు. ఏ వ్యక్తిని చూసినప్పటికీ ఆ వ్యక్తి భగవత్స్వరూపుడే అనే విశ్వాసాన్ని మనలో శాశ్వతం చేసుకోవాలి. మీకు ఎదురుగా వచ్చిన వ్యక్తి మిమ్మల్ని ద్వేషించేవాడైనప్పటికీ 'ఇతను నావాడే, నావాడే', అనుకోవాలి. భగవంతుని సృష్టిలో ప్రతి ఒక్కటీ మంచిదే. సృష్టిలో ఏదీ చెడ్డది లేదు; అంతా పవిత్రమైనదే. ఇందులో దుఃఖమునకు, బాధకు, కష్టమునకు అవకాశమే లేదు. దుఃఖమనేది మానవునియొక్క భ్రమయే. మానవత్వము మాయను చేరడంచేతనే దుఃఖము సంభవిస్తున్నది. 'మానవ' అనే పదములో 'మా' – మాయ; 'న' – లేకుండా; 'వ' – వర్తించుట. మాయకు అతీతంగా వర్తించువాడే మానవుడు. దేహభ్రాంతియే మాయ. తాను దేహము కాదని తెలుసుకోవాలి. మాయకు లోనైతే మర్మమే తెలియదు. మాయ అనేది మానవునియొక్క కల్పనయే. ఇట్టి కల్పనచేతనే మానవుడు దుఃఖమును అనుభవిస్తున్నాడు. సినిమాలో నటిస్తున్న వ్యక్తి సందర్భానికి తగినట్లుగా రౌద్రమును చూపుతుంటాడు; ప్రేమను చూపుతుంటాడు; ఆనందమును చూపుతుంటాడు; ఆహ్లాదమును చూపుతుంటాడు. అయితే, ఇవన్నీ తాను ఊహించుకున్న ఊహలే కదా! అదేరీతిగా, మానవుడు అనుభవించే సుఖదుఃఖములన్నీ తాను కల్పించుకున్న భ్రమలే. భ్రమను త్యజించినప్పుడే బ్రహ్మతత్త్వాన్ని గుర్తించుకోవడానికి వీలౌతుంది. ఒక పర్యాయం కుంతీదేవి కృష్ణపరమాత్మతో, 'కృష్ణా! నీవు సాక్షాత్తు భగవంతుడవే అయినప్పటికీ మానవ దేహమును ధరించి మామధ్య సంచరిస్తూ ఉండడంచేత నీవుకూడా మానవుడవే అన్న భ్రమను మాలో కలిగిస్తున్నావు', అన్నది. త్యాగరాజుకూడా అదేవిధంగా వర్ణించాడు:

"వాచామగోచరుండవు
నీ చరితమును పొగడ బ్రహ్మాదులకైన తరమా!
హే కృష్ణా! కాచుకున్నాను నీదు కృపకై
నా మొరాలకించి బ్రోవుమయ్య

sri sathyasaivachanamrutam

కాలుడు గొనిపోయిన గురుపుత్రుని తెచ్చి ఇచ్చినావు
కాళీయుని మదమణచినావు
వసుదేవ దేవకీ చెఱను విడిపించినవావు
వాలుగంటి ఆ ద్రౌపది 'హా! కృష్ణా!' యని మొరలిడ బ్రోచినావు
మేలుమేలు పాండవులను కాచినావు
కుచేలుని ఆర్తి తీర్చినావు
కురూపియైన కుబ్జ వక్రములను పోగొట్టినావు..."

ఈ ప్రపంచంలో మనం అనుభవించే మంచిచెడ్డలు మనలోని భావములేగాని, వేరు కావు. కాబట్టి, మన భావములను సరిచేసుకోవాలి. మనలో మానవత్వము వికసించాలంటే దుర్గుణములను దూరం చేసుకోవాలి.

**నీ మనస్సే నీ మిత్రుడు, నీ మనస్సే నీ శత్రువు**

ఎవరిపైనగాని నీకు ద్వేషం కలిగిందంటే, 'ఛ, ఇది నా మానవత్వానికే అవమానము' అని భావించి ద్వేషాన్ని అరికట్టుకో. మోహముకూడా మానవత్వానికి విరుద్ధమైనదని గుర్తించు. నీవు మోహించవలసింది దైవాన్నేగాని, వ్యక్తులను కాదు. నీవు నీ పుత్రుణ్ణి ప్రేమిస్తావు. ఎందుకంటే, పుత్రుణ్ణి నీ ప్రతిరూపంగా భావిస్తావు. అదేవిధముగా, 'అన్ని రూపములూ నావే' అని భావించు. నిన్ను ప్రేమించేవాడు, దూషించేవాడు, పరిహసించేవాడు నిజానికి ఒకడే. ఒకతూరి కోపించవచ్చును, రెండవతూరి ప్రేమించవచ్చును. ఇట్టి అశాశ్వతమైన భ్రమలను పెంచుకొని నీవు మాయలో మునిగిపోతున్నావు. నీకెవ్వరూ ద్వేషులు లేరు. నీకెవ్వరూ మిత్రులు లేరు. ప్రేమగాని, ద్వేషముగాని నీనుండే ఆవిర్భవిస్తున్నాయి. నీ మనస్సే నీ శత్రువు. నీ మనస్సే నీ మిత్రుడు. ప్రతి ఒక్కటీ మననుండి ఆవిర్భవించినటువంటివేగాని, దైవము అందించినటువంటివి కావు.

**నీవే బ్రహ్మా, నీవే విష్ణువు, నీవే శివుడవు**

ఎక్కడ చూచినను కనిపించేవి పంచభూతములేగాని, ఆరవ భూతము ఎక్కడా లేదు.

sri sathyasai vachanamrutam

మీరందరూ ప్రేమస్వరూపులే! ఇందులో ఎవ్వరూ వేరు కాదు. రెండవవాడు లేనే లేడు. ఉన్నాడనుకోవడం మీ భ్రమ. మీ అందరిలో ఉన్న ప్రేమయే ఈశ్వరస్వరూపము. ఇదియే బ్రహ్మయొక్క ఆకారము. కనుక, బ్రహ్మ అనగా ఎక్కడో లేడు; ఎక్కడో ఉన్నాడనుకోవడం మీ భ్రమ. 'మేము మానవుల మ'నుకోవడంకూడా ఒక భ్రమయే. సర్వమూ బ్రహ్మమయమే, దైవస్వరూపమే, ఆత్మస్వరూపమే, ఆనందస్వరూపమే. 'నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞాన మూర్తిం...' ఇవన్నీ భగవంతునియొక్క వర్ణనలే. కర్మకూడను బ్రహ్మస్వరూపమే. ఇట్టి పవిత్రమైన భావనతో మీరు కర్మను ఆచరించండి. అది తప్పక మీకు మంచి చేస్తుంది. ఎటువంటి పరిస్థితియందైనా దైవాన్ని దూషించకండి, తిరస్కరించకండి. అంతా దైవమే, అంతా బ్రహ్మమే. ఈ శివరాత్రినాడు మీరు తెలుసుకోవలసినది ఇదే – సర్వమూ బ్రహ్మమే, సర్వమూ విష్ణువే, సర్వమూ ఈశ్వరుడే. ఇటువంటి భావనను మీరు అలవరచుకోవాలి. దైవము కానటువంటిది ఈ లోకములో ఎక్కడా లేదు. అణు స్వరూపమైన ఇసుక, ఘనస్వరూపమైన లడ్డు రెండూ ఒకటే. ఈ సత్యాన్ని గుర్తించినట్లయితే మీరు బ్రహ్మ స్వరూపులుగా రూపొందుతారు. ఎందరో యోగులు, సాధకులు బ్రహ్మకోసం వెతుకుతూ ఉన్నారు. బ్రహ్మ ఎక్కడున్నాడని వెతుకనక్కరలేదు. నీవే బ్రహ్మ. నీవే విష్ణువు. నీవే శివుడవు. నీ భావములే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపములను ధరిస్తున్నవి.

**ప్రపంచమంతా జీరో, భగవంతుడే హీరో**

'మేమందరమూ చేరి ఒకటే' అనే భావముతో మీరు మెలగాలి. రెండవది లేనే లేదు. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. దీనిని మీరు సరిగా అర్థం చేసుకోలేకపోవడంచేతనే ఒకటిగా ఉన్నది మీకు రెండుగా కనిపిస్తున్నది. మీకు ఆధ్యాత్మిక గణితం సరిగా తెలియదు. అది తెలిసినవానికి సర్వత్రా ఒకటే కనిపిస్తుంది. అదియే దైవము. ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించడం చాలా అవసరం. జీవుడు వేరు, దేవుడు వేరు అని భావించడం పొరపాటు. ఏకత్వాన్ని మనము భావించినప్పుడే దైవత్వము గుర్తింపునకు వస్తుంది. ఒకటి ప్రక్కన సున్న పెడితే 10 అవుతుంది. మరొక సున్న పెడితే నూరు అవుతుంది. ఈరీతిగా,

సున్నలు పెట్టే కొలదీ విలువ పెరుగుతూ వస్తుంది. ఒకటిని తీసేస్తే మిగిలేది సున్నయే. 'నేను', 'నా భార్య', 'నా పిల్లలు', 'నా భూమి', 'నా ఇల్లు' .... ఈరకంగా మీరు అనేక సున్నలు పెట్టుకుంటూపోతున్నారు. కట్టకడపటికి ఏమీ ఉండదు. వీటి ప్రక్కన భగవంతుడనే 'ఒకటి' పెట్టినప్పుడే వీటన్నింటికీ విలువ చేకూరుతుంది. ప్రపంచమంతా ఒక జీరో. భగవంతుడే హీరో. కాని, మీరు భ్రమలో మునిగి 'జీరో'ను 'హీరో'గా భావిస్తున్నారు. మీరు మీ భ్రాంతులను త్యజించనంత వరకు దైవసాక్షాత్కారమును పొందలేరు.

**'సంశయాత్మా వినశ్యతి'**

ఈ భ్రాంతులు, అనుమానాలు ఇవన్నీ మీ ఆనందాన్ని పాడుచేస్తున్నాయి. ముఖ్యంగా, doubts అనేవి poison (విషం)తో సమానం. మొట్టమొదట ఆ poison ను తీసి పారవేయండి. సంశయాత్ముడు ఏ నిమిషంకూడా ఆనందాన్ని పొందలేడు. కొందరు ఇతరులను ఊరకే అనుమానిస్తుంటారు. ఇది ఎంత ప్రమాదకరం! అందరినీ తాను అనుమానిస్తుంటే తనపై ఇతరులకుకూడా అనుమానం రాకుండా ఉంటుందా! అటువంటివారు అందరితోను 'ఛీ' అనిపించు కుంటారు. కాబట్టి, మీరు అనవసరంగా ఇతరులను అనుమానించకూడదు. ఒకవేళ 'డౌట్' వచ్చినా దానిని నెట్టివేయాలి. అప్పుడే మీయందు విశ్వాసము దృఢ మవుతుంది. కారుయొక్క నాల్గు టైర్లలోనూ గాలి సరిగా ఉన్నప్పుడే అది చక్కగా నడుస్తుంది. ఏ ఒక్క టైరుకి పంక్చర్ అయినా ప్రమాదం జరుగుతుంది. మానవ దేహము ఒక కారువంటిది. మనస్సే స్టీరింగు. ధర్మార్థ కామమోక్షములనేవి నాలుగు టైర్లు. వాటియందు విశ్వాసమనే గాలి నింపాలి. ఈ టైర్లలో ఏ ఒక్కదానికి పంక్చర్ అయినా జీవితానికే ప్రమాదం జరుగుతుంది. మనస్సును నిశ్చలంగా ఉంచుకోవాలి; సరియైన మార్గంలో పెట్టుకోవాలి. అప్పుడే క్షేమంగా గమ్యాన్ని చేరుకోగలరు.

**ఆత్మను గుర్తించాలంటే 'నా' అనే భావాన్ని త్యజించాలి**

నీవు క్రిమివి కాదు, కీటకానివి కాదు, పశువు కాదు, పక్షి కాదు, మృగానివి కాదు. నీవు మానవుడవు. 'మా-నవ'. 'మా' అనగా కాదు; 'నవ' అనగా క్రొత్త. మానవుడు క్రొత్తవాడు

sri sathyasaivachanamrutam

కాదు, పాతవాడే! ఇది నీ మొదటి జన్మ కాదు. ఎన్నో జన్మలెత్తిన తరువాత మానవత్వాన్ని ధరించావు. కాబట్టి, నీ పాత, రోత భావాలను విసర్జించు. నీ జన్మను నవ్యమైన, దివ్యమైన భావాలతో నడిపించు. మానవత్వ మనేది ఎంతో నిగూఢమైన తత్త్వముతో కూడినది. ఇట్టి తత్త్వమును ఒక్క భగవంతుడు మాత్రమే వివరించగలడు. విశ్వేశ్వరుడు ఆత్మస్వరూపుడై విశ్వమంతటా నిండి ఉన్నాడు. ఇట్టి ఆత్మతత్త్వాన్ని గుర్తించడానికి ఒక్కటి మాత్రం చాలు. ఏమిటది? 'నా' అనే భావాన్ని పూర్తిగా త్యజించు. 'ఇది నాది, అది నాది' అనే ప్రాపంచిక వ్యామోహాన్ని విడిచిపెడితే నీవు నిర్మల, నిశ్చల, నిస్వార్థ స్వరూపునిగా రూపొంది, చింతలనుండి విముక్తునివై మోక్షాన్ని పొందుతావు.

విద్యార్థులారా! మీరు మానవత్వమునుండి మాధవత్వమును పొందాలి. అదే మీ గమ్యం. మాధవత్వమును పొందాలంటే సన్మతిని పోషించుకోవాలి. 'యూనిటీ' (ఐక్యత) 'ప్యూరిటీ' (పవిత్రత)ని కలిగిస్తుంది. 'ప్యూరిటీ' 'డివినిటీ'ని (దివ్యత్వాన్ని) సాక్షాత్కరింపజేస్తుంది. మనమందరం మానవులమే; సోదరీ సోదరులమే. ఇటువంటి 'యూనిటీ'ని మీరు అభివృద్ధిపరచుకోవాలి. మీరు సత్యసాయి కాలేజీలో చదువుకున్నందుకు ఏకత్వాన్ని సాధించి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలవాలి. ఏకత్వాన్ని సాధించినప్పుడే మీరు సాయిభక్తులు అనిపించుకుంటారు. భగవంతుణ్ణి ప్రేమించండి. ఆ ప్రేమయే ద్వేషాన్ని దూరం చేస్తుంది. ప్రేమ తత్త్వముచేత సర్వమును సాధించవచ్చును. కనుక, ప్రేమను పెంచుకోండి.

*('ప్రేమముదిత మనసె కహో...' అనే భజన గీతాన్ని పాడిన తరువాత భగవాన్ తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు)*

ప్రేమస్వరూపులారా! అనాదికాలమునుండి రామ నామము భక్తులను సంరక్షిస్తూ, వారిని సన్మార్గములో నడిపిస్తూ వస్తున్నది. యుగయుగాలుగా రామ నామము ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిందంటే, ఇదే ఒక అద్భుతము. దీనినిబట్టి రామనామముయొక్క మహాత్మ్యమును మీరు అర్థం చేసుకోవచ్చు. ఇన్ని వేల సంవత్సరములు గడచిపోయినప్పటికీ రామనామము ఇప్పటికీ నిత్య నూతనంగా భాసిస్తున్నది. పల్లెలవారైనా, పట్టణములవారైనా, గుట్టమీదవారైనా రామనామాన్ని

srisathyasaivachanamrutam

తలచనివారు లేరు. 'రామ' అనగా ఏమిటి? 'రమయతీతి రామః', రమింపజేయునది రామతత్త్వము.

**'ఏ ఆవ్ రా బా వా'**

ఒకానొక సమయంలో శ్రీకృష్ణదేవరాయలు తన ఆస్థానంలోని అష్టదిగ్గజాల నుద్దేశించి ఒక ప్రశ్న వేశాడు: ఐదు వేర్వేరు భాషలకు చెందిన ఐదక్షరాలను చేర్చి ఒక అర్థవంతమైన వాక్యమును ఎవరైనా చెప్పగలరా? అని. ఆ ఐదక్షరాలూ ఆయా భాషలలో ఒకే అర్థాన్నిచ్చేవిగా ఉండాలని అన్నాడు. మరుసటి రోజు ఉదయానికల్లా తన ప్రశ్నకు సమాధానం చెప్పగల్గిన వ్యక్తిని సభలో ఘనంగా సత్కరిస్తానని ప్రకటించాడు. ఆనాటి సభ ముగిసిన తరువాత తెనాలి రామకృష్ణుడు ఆ రాత్రికి అదే ఊరిలో ఉన్న తన బావమరిది ఇంటికి వెళ్ళాడు. బావగారు వచ్చారు కదా అని రాత్రి పడుకోవడానికి అతను ఒక మంచం, పరుపు ఏర్పాటు చేశాడు. రామకృష్ణుడు, "బావా! మహారాజు అడిగిన ప్రశ్నగురించి నేను ఈ రాత్రి బాగా ఆలోచించాలి. నీవు నాకోసం పరుపు వేశావంటే హాయిగా నిద్రపోతాను. కాబట్టి, పశువుల కొట్టంలో నాకొక మంచం వేయించు, చాలు", అన్నాడు. అతని కోరికమేరకు పశువుల కొట్టంలో ఒక మంచం ఏర్పాటు చేయబడింది. రామకృష్ణుడు ఆ మంచంపై పడుకొని మహారాజు అడిగిన ప్రశ్న గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. రాత్రి ఒంటి గంటకు ఆ పశువుల కొట్టంలో ఒక ఆవు ఈనడానికి సిద్ధంగా ఉంది. అది గమనించి రామకృష్ణుడు లేచి, "బావా! ఆవు ఈనుతోంది. వచ్చి చూసుకో," అని చెప్పాడు. ఆయన లోపలినుండి, "ఏ ఆవురా బావా?" అని అడిగాడు. ఎందుకంటే, ఆయన తన ఆవులకు లక్ష్మి, సరస్వతి, పార్వతి.... అని పేర్లు పెట్టుకున్నాడు. ఈ మాట వినేసరికి రామకృష్ణుని మనస్సులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది. మహారాజు అడిగిన ప్రశ్నకు సమాధానం దొరికిపోయింది. పట్టలేని ఆనందంతో తానుకూడా "ఏ ఆవ్ రా బా వా!" అన్నాడు. బావమరిది మళ్ళీ, "ఏ ఆవురా బావా?" అని అడిగాడు. రామ కృష్ణుడు "ఏ ఆవ్ రా బా వా!" అని జవాబు చెప్పాడు. రాత్రి నిద్ర లేనందువలన బావగారికి మతి చెడిపోయింది కాబోలు అనుకున్నాడాయన. రామకృష్ణుడు "ఏ ఆవ్ రా బా వా!" అని పదేపదే అనుకుంటూ

sri sathyasai vahinimrutam

తెల్లవారుజామున లేచి స్నానం చేసి రాజాస్థానానికి వెళ్ళాడు. రాయలు తన ప్రశ్నకు ఎవరైనా జవాబు తెచ్చారా? అని అడిగాడు. అది అసాధ్యమన్నారు అందరూ. అప్పుడు రామకృష్ణుడు లేచి, "మహారాజా! 'ఏ ఆవ్ రా బా వా!' అనే వాక్యంలో మీరు కోరినట్లుగా ఐదు భాషలకు చెందిన ఐదక్షరాలున్నాయి. అవి ఆయా భాషలలో ఒకే అర్థాన్నిస్తాయి" అన్నాడు. మరాఠీలో 'ఏ' అన్నా, హిందీలో 'ఆవ్' అన్నా, తెలుగులో 'రా' అన్నా, కన్నడంలో 'బా' అన్నా, తమిళంలో 'వా' అన్నా అర్థం ఒకటే.

**మీ అందరి ఆనందమే నాకు బ్రహ్మానందము**

విద్యార్థులారా! ఒక్కొక్క పదమునకు అనేక అర్థములుంటాయి. కనుక, మీరు ఇతరులతో మాట్లాడే సమయంలో పదములను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. మీరు చదువుతున్నారు; గొప్పగొప్ప డిగ్రీలు తీసుకుంటున్నారు. అయితే, మీరు ఈ చిన్నచిన్న విషయాలనుకూడా తెలుసుకోవాలి. చిన్న విషయాలను చక్కగా తెలుసుకున్నప్పుడే పెద్దవాటిని కూడా సాధించగలుగుతారు. మీరందరుకూడా మంచి గుణములు కలిగి, మంచిబుద్ధి కలిగి, మంచినడత కలిగి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలవండి. మీరందరూ ideal life (ఆదర్శవంతమైన జీవితం) గడిపినప్పుడే స్వామికి ఆనందము. స్వామికి ఎవరు ఆనందాన్నిస్తారో వారికి నేనుకూడా ఆనందాన్నిస్తాను. మీ అందరి ఆనందమే నాకు బ్రహ్మానందము. మీరు ఎక్కడికి వెళ్లినప్పటికీ మంచిపేరును పొందాలి. మీ నడతయే నాకు ముఖ్యం. కనుక, మీ నడతను చక్కగా తీర్చిదిద్దుకోండి. ఇదే ఈ శివరాత్రినాడు నేను మీకు అందించే గొప్ప సందేశము. మీరందరూ ఆనందాన్ని అనుభవించిన దినమే నా శివరాత్రి.

**'ఎందరో మహానుభావులు....'**

త్యాగరాజు తంజావూరులో గానసభ జరిపినప్పుడు గొప్ప పండితులు, సంగీత విద్వాంసులు విచ్చేశారు. త్యాగరాజు ముందుగా వారందరికీ నమస్కరించి, 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అని గానం చేశాడు. అతని గానామృతాన్ని ఆస్వాదిస్తూ సభలో ఉన్నవారందరూ ఆనందపరవశు లైనారు. అందరిలో

sri sathyasaivachanamrutam

భగవంతుడున్నాడు. కాబట్టి, సభనుద్దేశించి ప్రసంగించే ముందుగా అందరికీ నమస్కరించడం విద్యావంతుల లక్షణం. మన ప్రశాంతి నిలయంలో ఆరోజుల్లోకూడా గొప్పగొప్ప సభలు జరిగేవి. గొప్ప పండితులను పిలిపించి, వారిచేత ప్రసంగాలిప్పించే వారము. ఒకతూరి ఒక పండితుడు తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, 'సోదర సోదరీమణులారా, ఒకరు తప్ప' అన్నాడు. 'ఈయన ఇట్లా అంటున్నాడేమిటి?' అని అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడాయన "ఇక్కడ సమావేశమైనవారిలో నా భార్యకూడా ఉన్నది", అని వివరించాడు. సభలో ప్రసంగించేటప్పుడు ఇట్టి భేదాలను పెట్టుకోకూడదు. అందరికీ నమస్కరించాలి.

ప్రేమస్వరూపులారా! మీ అందరికీ నేను శివరాత్రి ఆశీస్సుల నందిస్తున్నాను. సాధ్యమైనంతవరకు మీరు ఈ రాత్రంతా మేలుకొని నామస్మరణ చేయండి. అప్పుడే మీరు దైవతత్త్వమును అనుభవించగలరు. మీకు దివ్యమైన కాంతికూడా కనిపించవచ్చు. కాబట్టి, మనస్ఫూర్తిగా నామస్మరణ చేయండి. ఏ నామమైనా పాడండి. కాని, 'దిగంబర' అనే పదమును మాత్రము మీ పాటలలో చేర్చకండి. దిక్కులు వస్త్రములుగా కలిగినటువంటివాడు దిగంబరుడు. కాని, దీని అర్థము తెలియనటువంటివారు దిగంబరుడంటే దుస్తులు ధరించనటువంటివాడని భావిస్తారు. కాబట్టి, దీనిని దృష్టిలో పెట్టుకొని మీరు 'దిగంబర' అనే పదమును భజనలో ఉపయోగపెట్టకండి.

(తేదీ 26.02.2006, శివరాత్రి, సాయికుల్వంత్ హాలు)

sri sathyasai vachanamrutam